


# సర్పశిల

## - భువనచంద్ర



*(గత సంచిక తరువాయి)*

*ఇప్పటివరకూ జరిగిన కథ*

*ఓ అడవిలోనున్న ఆలయం దగ్గర మొదలైన కథ, 'రాబీ వెబ్‌స్టర్ ' అనే అమెరికన్ ఇండియాలో దిగడంతో ఓ మలుపు తిరుగుతుంది. 'తక్షపురం 'లోని సర్పశిల ఒక మలుపుకి సంకేతమైతే 'నల్లమల 'లో జరిగిన విశ్వశాంతి యజ్ఞం మరో మలుపు. ఒక వైపున కొన్ని శక్తులు ప్రకృతి విధ్వంసానికి రచన చేస్తూంటే మరోవైపు ప్రకృతి రక్షకులు ప్రకృతిని కాపాడే ప్రయత్నాలు ముమ్మరం చేస్తుంటారు. అనేకానేక పాత్రలు తమ విధిని నిర్వర్తిస్తూవుంటాయి. అందరి లక్ష్యమూ ఒకటే - విశ్వశాంతి.*

**త్రికాలానంద** కళ్ళు తెరవడానికి దాదాపు రెండుగంటలు పట్టింది. రాబీ అతనితో, "సర్.. మీరు కళ్ళు తెరిచాక మీతో చెప్పి వెళ్ళిపోదామనుకున్నాను" అన్నాడు.

చిన్నగా నవ్వాడు త్రికాలానంద. సమాధానం చెప్పలేదు.

"నేను వెళ్ళొచ్చా?" లేచి నిలబడి అన్నాడు రాబీ.

"నన్ను అడిగి ఇక్కడికి రాలేదుగా బంధూ. ఇది అరుణాచలేశ్వరుడి చోటు. ఇక్కడి రావాలంటే, ఆయన అనుజ్ఞ ఉండాలి. వెళ్ళాలన్నా ఆయన అనుజ్ఞ ఉండాలి. అది లేక ఎవ్వరూ ఇక్కడికి రాలేరూ, పోలేరూ" అన్నాడు త్రికాలానంద. అయోమయంగా నిలబడ్డాడు రాబీ. అక్కడేవున్న ప్రవస్థి "స్వామీజీ, ఇందాక మీరు ఓ ట్రాన్స్‌లో మిస్టర్ విలియమ్స్ గా మాట్లాడారు. వీరికి కొన్ని సూచనలు కూడా ఇచ్చారు అందుకే వీరు మీ అనుజ్ఞ కోరుతున్నారు" అన్నాడు.

"వారు వెళ్ళిపోయారుగా ఇప్పుడు వీరేం చెప్పగలరు?" అన్నాడు రాబీ అసహనంతో.

"అవును. ఎవరు వచ్చారో వాళ్ళు వెళ్ళారు. ఎవరు రావాలో వారు వచ్చేవరకూ మీరు వెళ్ళలేరేమో" అన్నాడు త్రికాలానంద.

"ఎవరూ రావాల్సిందీ?" అడిగాడు ప్రవస్థి.

"బాబూ నీవెవరో నాకు తెలీదు. అనవసర కుతూహలం కూడదని నీ గురువులెవ్వరూ నీకు చెప్పలేదా?" సీరియస్‌గా అన్నాడు త్రికాలానంద.

ప్రవస్థి సైలెంటైపోయాడు. అప్పటికి తెలిసిందతనికి, తను చూపుతున్న కుతూహలం తగినది కాదని.

"క్షమించండి" త్రికలానందతో అని లేచాడు ప్రవస్థి.

త్రికాలానంద ఏమీ మాట్లాడలేదు. రాబీతో పాటు ప్రవస్థి కూడా బైటికి వచ్చాడు.

"మీరెక్కడుంటున్నారు?" అడిగాడు ప్రవస్థి రాబీని.

"శివసన్నిధిలో" అన్నాడు రాబీ.

"అవును.. అక్కడ యాత్రికులకు బస భోజనం ఉచితంగా ఇస్తారు. అయితే, సంస్థని ఇంకా బలపరచడం కోసం మనం ఇవ్వదలచుకున్నది ఇవ్వొచ్చు" అన్నాడూ ప్రవస్థి.

"యా. ఓ అమెరికన్ ఫ్రెండ్ మొన్నటివరకూ ఇక్కడే ఉండేవాడు.. తను చెబితేనే తెలిసింది. నేను ప్రస్తుతం ఉన్నది శివసన్నిధిలో. మా ఫ్రెండు ఇక్కడ అద్దెకు తీసుకున్న ఇల్లు కూడా ఉన్నది" ఓపిగ్గా జవాబిచ్చాడు రాబీ.

కానీ, అతని మనసులో ఆలోచన. ఎంతకాలం ఇక్కడుండాలీ? ఇండియాకి రావడమే ఓ సుడిగుండంలో పడినట్టుగా అతనికి అనిపించింది. భారతీయుల జీవనశైలి చాలా మిస్టిక్‌గా అనిపించిందతనికి.

కాషాయం కట్టిన ప్రతివాడూ టన్నుల టన్నుల పనికొచ్చే, పనికిరాని, పనికిమాలిన జ్ఞానాన్ని బోధించేవారిలాగే అతనికి కనబడుతున్నారు.

అందరూ అన్నీ తెలిసినట్లుగానే మాట్లాడటం అతనికి చికాకు తెప్పిస్తోంది. అతను ఎంత ఆలోచనలలో కూరుకుపోయాడంటే, ప్రవస్థి తన పక్కనే నడుస్తున్న సంగతి కూడా మరిచిపోయాడు. అసంకల్పితంగా రమణ మహర్షి ఆశ్రమంలోకి అడుగుపెట్టాడు.

"హలో రాబీ" గట్టిగా వినిపిస్తే తలెత్తి చూశాడు రాబీ.

ఎదురుగుండా నవ్వుతూ జయ్.

"మైగాడ్...యా..." ఆనందంగా జయ్‌ని హగ్ చేసుకున్నాడు రాబీ."

"హౌ కం" అన్నాడు.

"నువ్విక్కడికి వచ్చినట్టు తెలిసింది. ఎడ్వర్ట్ చెప్పాడు. లింక్స్ సరిగ్గా లేవుగనక ఇక్కడే దొరుకుతావని అనిపించింది. వచ్చేశాం. రాబీ, ఇతను ఎడ్వర్ట్ డాంటే, ఇతను సచేత్ దద్లానీ. ద సిటీ అబ్జర్వర్ యజమాని. ఆయన శమంతో భట్టాచార్య" అందర్నీ పరిచయం చేశాడు జయ్.

అందర్నీ చూస్తూ ఆశ్చర్యపోయాడు ప్రవస్థి.

"అసలు నాకోసం ఎందుకొచ్చారూ? జయ్...నాకంతా ఏదో అయోమయంగా వుంది. ఇందాకే విలియమ్స్ ఓ సన్యాసి రూపంలో నాకు ఏవేవో చెప్పాడు. పూర్వ జన్మలో నేను ఇండియన్ అదేదో అన్నాడు" ఆగాడు రాబీ.

"ఇండియన్ బ్రాహ్మిన్ అనీ కొన్ని దశాబ్దాలపాటో, శతాబ్దాలపాటో అశరీరులుగా ఉన్నారనీ చెప్పాడు. ఎదురు చూడటం తప్ప మరో ఛాయిస్ లేదనీ అన్నాడు" వివరించాడు ప్రవస్థి.

"వీరెవరూ?" ప్రవస్థిని చూపించి రాబోని అడిగాడు జయ్.

"ఆయనపేరు నా నోటికి తిరగదు. సన్యాసికి నాకూ మధ్య ట్రాన్స్‌లేటర్, నో....నో.. అతనికి  ఇంగ్లీష్ వచ్చు. నా ప్రశ్నకి ఇంగ్లీషులో ఇతను చెప్పాడు" అన్నాడు రాబీ.

"అయ్యా నా పేరు ప్రవస్థి. నేను పుట్టిందీ పెరిగిందీ చెన్నై పట్నం. మా పూర్వీకులు తెలుగువాళ్ళు.  మా ముత్తాతల కాలంలో యీ చెన్నపట్నంలో 60 నించి 70 శాతం తెలుగువారు ఉండేవారు. ఇక్కడి జౌళి పరిశ్రమ, వ్యాపారాలూ, బంగారు దుకాణాలూ అన్నీ అభివృద్ధి పరిచింది తెలుగువారే. మా తాత ఉభయ భాషా ప్రవీణ. ఆ తరువాత తమిళం ఇంగ్లీషులో కూడా అపారమైన పాండిత్యం సంపాదించారు. అందుకే నాకు తెలుగు సంస్కృతం, ఇంగ్లీష్, తమిళ భాషలు చక్కగా వచ్చు. తిరువణ్ణామలైకి నేను ప్రతి ఏకాదశికీ వస్తాను. వీరి పరిచయం ఇందాకే జరిగింది" వినయంగా తన పరిచయం చేసుకున్నాడు ప్రవస్థి. జయ్ కూడా మిగతావారందర్నీ ప్రవస్థికి పరిచయం చేశాక రాబీని అడిగాడు "ఏ రూం?" అని.

"నాకిక్కడ రూం లేదు. ఏదో ఆలోచనలో పడి వచ్చాను గానీ, నేనుండేది శివసన్నిధిలో" అన్నాడు రాబీ.

"సరే.. అక్కడికే పోదాం రాబీ" అన్నాడు జయ్.

"నేనూ రావొచ్చా?" అడిగాడు ప్రవస్థి.

"మేం కొన్ని ప్రత్యేక విషయాలు మాట్లాడుకోవాలి ప్రవస్థీ...సారీ" అన్నాడు జయ్ నిర్మొహమాటంగా.

"జయ్... అతన్ని రానివ్వండి. ఎందుకంటే, విలియమ్స్ ఓ సన్యాసి ద్వారా మాట్లాడినప్పుడు ఇతనూ ఉన్నాడు. అంతేకాదు. ఇతను కూడా నాతో ఉంటే, నాకు తెలియనివి తెలుసుకోగలననే నమ్మకం  నాకు వచ్చింది" అన్నాడు రాబీ.

"ఓకె ప్రవస్తీ, కానీ ఓ మాట... మేం మాట్లాడుకునే మాటల్ని ఒక్కటైనా కూడా నువ్వు బయటపెట్టకూడదు" అన్నాడు జయ్.

"అలాగే! కుతూహలం ఉండకూడదని త్రికాలానందజీ ఇందాకే నన్ను హెచ్చరించారు. కానీ, రాబీగారి విషయంలో నా కుతూహలం ఎంత అణచినా అణగటంలేదు. సరే... నేను ఎవరి విషయంలోనూ జోక్యం చేసుకునేవాడ్ని కాదు. ఈ విషయంలో నా ప్రవర్తన నాకే ఆశ్చర్యంగా ఉంది" అన్నాడు ప్రవస్థి ఇంగ్లీషులో.

విషయం అందరికీ అర్ధమయింది.

"ఆ రూం చాలా చిన్నది" అన్నాడు రాబీ.

"ఎక్కడ సమావేశమైతే బెస్ట్? చెప్పగలరా?" ప్రవస్థిని అడిగాడు జయ్.

"మీరేమీ అనుకోకపోతే ఈ వూళ్ళోనే నా స్నేహితుడి ఇల్లుంది. చాలా పెద్దది. హాల్లోనే ఓ యాభైమంది విశ్రాంతిగా కూర్చోవచ్చు. ప్రస్తుతం అక్కడుంది నా స్నేహితుడి తల్లీ తండ్రీ, ఓ కూతురు, అంటే నా ఫ్రెండ్ అక్క మాత్రమే. అభ్యంతరం లేకపోతే నేను మిమ్మల్ని అక్కడికి తీసుకెళ్తాను" అన్నాడు ప్రవస్థి ఇంగ్లీషులోనే.

"ఓక్. దట్స్ బెటర్" అన్నాడు డాంటే. డాంటే, రజోవ్స్కీ, దద్లానీ అందరికీ తిరువణ్ణామలై వేడి భరించలేనంతగా అనిపిస్తోంది. అందరూ నడవడం మొదలెట్టారు.

"అవునూ.. నేను రమణమహర్షి ఆశ్రమానికి వస్తానని మీరెలా ఊహించారూ? అసలక్కడికి వెళ్ళాలని నేనే అనుకోలేదు" సడన్‌గా ఆగి అన్నాడు రాబీ.

"తిరువణ్ణామలై వచ్చాంగనక ఆశ్రమాన్నే ముందు దర్శించుదాం. ఎవరొచ్చినా యీ ఊరికి వచ్చేది అరుణాచలేశ్వరుడి దర్శనానికీ, గిరిప్రదక్షిణకీ, రమణాశ్రమానికీ. మిగతావి ఎన్నోవున్నా, అతి మెల్లగా సమయాన్ని బట్టి చూసేవి. ఎందుకో నాకు అనిపించింది.. మనం ఆశ్రమంలోనే కలుస్తామని. అదే నిజమైంది 'భగవాన్ రమణులు' అంటారు గదా. ఇది ఆయన అనుగ్రహమేమో" భక్తిగా అన్నాడు జయ్ ఇంగ్లీషులోనే.

"అయ్యా ఇక్కడ ఉండేది అగ్ని లింగం. అగ్నికి అటువైపు ఉండేవి ఆకాశం, వాయువు. ఇటువైపు ఉండేది జలము, పృధ్వి. అటూ ఇటూ రెండిట్నీ బ్యాలన్స్ చేసే శక్తి ఉన్నది అగ్నికి మాత్రమే. అగ్ని గనక తనని తాను ఉపసంహరించుకుంటే, సృష్టి అనేదే ఉండదు. అయ్యా.. ఇదొక మహాజ్యోతిర్లింగం. అత్యంత పురాతనం. అత్యంత శక్తిమంతం. ఇక్కడ ఏది సంకల్పించినా ఖచ్చితంగా జరుగుతుంది .అయితే, చెడు సంకల్పాలు చేస్తే అప్పుడు అవి 'దహింప'బడతాయి. సంకల్పం ఫలిస్తుంది. **అగ్ని లేనిదే పదార్థం లేదు. పదార్థంకానిది శక్తేకాదు.** రూపాలు వేరు వేరు. చిన్ననోటికి పెద్దమాట అనుకోకండి. ఒక్కోసారి 'ఎనర్జీ' 'మేటర్ 'గా రూపు కడితే, మరోసారి 'మేటర్'లోంచి 'శక్తి' లావాలా తన్నుకొస్తుంది. ఇది సూక్ష్మంగా ఆలోచించవలసిన విషయం" అన్నాడు ప్రవస్థి ఇంగ్లీషులోనే.

"అసలు మీ ఇండియాలోని ప్రతివాళ్ళూ వేదాంతులూ, ప్రవచకులూ, సైంటిస్టులేనా, యూ పీపుల్ హావ్ లాట్ అండ్ లాట్ టూ టాక్!" నొసలు ముడిచి అన్నాడు రాబీ.

"యస్... యూ మేడ్ సెన్స్" అన్నాడు డాంటే నవ్వుతూ. ప్రవస్థి సిగ్గుపడ్డాడు తన అనవసర ఉత్సాహానికి.

"అదంతా మా తాతగారు బోధించిన విషయాలు అందుకే..." మెల్లగా అన్నాడు ప్రవస్థి.

"నువ్వు చెప్పిన విషయాల్లో చాలా 'విషయం' ఉంది ప్రవస్థీ. ఆ మాటలు మామూలివి కావు. తరచి చూస్తేగానీ వాటి విలువ తెలీదు. నువ్వేం సిగ్గుపడాల్సిన పనిలేదు" అన్నాడు గోర్కీ. అప్పటివరకూ గోర్కీకి రాబీని సునిశితంగా గమనించడమే సరిపోయింది.

"యస్... దేరీజ్ సంథింగ్" అన్నాడు రాజోవ్‌స్కీ.

మెయిన్ రోడ్డుమీదనించి ఓ సందులోకి తీసుకెళ్ళాడు ప్రవస్థి. అక్కడినించి మరో సందు, మరో సందు, మరో సందు... చివర డెడ్ ఎండ్.

అక్కడే ఓ పేద్ద భవనం. సందుకి అటూ ఇటూ అప్పటి కాలపు పెంకుటిళ్ళు, అరుగుల ఇళ్ళూ ఉన్నాయి.నగరమంతా నాగరికతని పులుముకున్నా ఆ వీధి మాత్రం మడికట్టుకుని మధ్య యుగపు ఛాయల్లోనే ఉండిపోయింది. ప్రతి ఇంటిముందూ కళ్ళాపి చల్లిన గుర్తులున్నాయి. చక్కని ముగ్గులూ కనిపిస్తున్నాయి. ప్రతి ఇంటిముందూ ఏదో ఓ పెద్ద చెట్టో, వృక్షమో ఉండడంవలన వీధంతా చల్లగా హాయిగా ఉంది.

"ఓ... ప్రాణంలేచొచ్చింది" పెద్దగా నిట్టూర్చి అన్నాడు దద్లానీ.

"అవును..ప్రాణం కుదుటబడింది" అన్నాడు శమంతో భట్టాచార్య.

అందరూ ఆ మహాభవంతి దగ్గరికి చేరారు. పెద్ద గేటూ. గేటునించి లోపలికి ఓ పది అడుగుల సిమెంటు దారి. అటూ ఇటూ పూలచెట్లూ, ఫలవృక్షాలు.

లోపలికి వెళ్ళి మెట్లపైకెక్కి డోర్ బెల్ కోట్టాడు ప్రవస్థి. ఓ ఇరవైమూడేళ్ళ అమ్మాయి బయటికొచ్చి ప్రవస్థిని చూసి,

"రా బిన్నీ" అంది.

"వీరందరూ ఇంతకు ముందే నాకు పరిచయం అయ్యారు అక్కా అందర్నీ తీసుకురావొచ్చునా?" అన్నాడు ప్రవస్థి.

"రండి" అందరివంకా చూసి చిరునవ్వుతో ఆహ్వానించిందామె.

ఫారినర్స్ ఉండటం ఆమెకి ఆశ్చర్యమనిపించింది.

"అమ్మా నాన్నా?" అడిగడు ప్రవస్థి.

"గుడికెళ్ళారు. ఇంకో గంటలో వస్తారు" అందరికీ సోఫాలు చూపించి అంది.

జయ్ ఆశ్చర్యపోయాడు. ఆ భవంతి ఎప్పటిదో! ఫర్నిచర్ అంతా చాలా ఖరీదైనది. మెహగని, రోజ్‌వుడ్ టైపు కలపతో చేయబడ్డాయి అక్కడ కుర్చీలూ, మేజాలూ.

అందరూ కూర్చోగానే ప్రవస్థీ, వాళ్ళ అక్క లోపలికి వెళ్ళి చక్కని గ్లాసుల్తో మంచినీళ్ళు తెచ్చి అందరికీ ఇచ్చారు.

"యా.. ఐ లైక్ దిస్ ట్రెడిషన్" మెచ్చుకుంటూ అన్నాడు డాంటే.

"అసలు సిసలు ప్రొసీజర్ ప్రకారం మనం మన కాళ్ళూ, చేతులూ, ముఖం కడుక్కున్న తరవాతే లోపలికి అనుమతిస్తారు"చిన్నగా నవ్వి అన్నాడు జయ్.

"మరి?" ఆశ్చర్యంగా అన్నాడు రాజోవ్‌స్కీ

"కాలక్రమేణా ఇంగ్లీషు వారి రాకతో మా సంస్కృతీ సంస్కారాలు కొన్ని పక్కదారి పట్టక తప్పలేదు" నిట్టూర్చి అన్నాడు జయ్.

"అఫ్‌కోర్స్.. ఏ దేశాన్నైనా మరో దేశం ఆక్రమించుకున్నప్పుడు జరిగేది ఇదే. అన్నీ మారిపోయాయి, లేదా పక్కదారిపడతాయి. మా దేశం పరిస్థితి మరీ ఘోరం. దాదాపుగానో పైగానో ఎనిమిది వందల సంవత్సరాలు పరాయి పాలనలో ఉంది. అయినా కూడా కొద్దో గొప్పో మా ఆస్తి నిలబడటానికి కారణం..." ఆగాడు జయ్.

"చెప్పండి" అన్నాడు శీమంతో.

"మా పూర్వీకుల బోధ.. తరతరాలుగా వస్తున్న శాంతి కాముకత సాధన" మాట పూర్తి చేశాడు జయ్.

"హౌ? ఎలా?" అన్నాడు రాబీ.

"మీకు అర్జంటుగా ధనం కావాలి, చేతిలోవుండి తీరాలి. మీ పెద్దలు చెప్పిందేమిటీ? బెగ్ బారో ఆర్ స్టీల్ అంటే, ముష్టెత్తుకో, లేకపోతే అప్పడుగు.. అదీ కుదరకపోతే దొంగతనం చెయ్యి – అని. మరి పెద్దలు చెప్పింది చాలానే ఉన్నా, మేం సేకరించవలసినంత వరకూ సేకరించి ఆ పైన భారమంతా దేవుడి మీద వేస్తాం. కేవలం ధనమే కాదు.ఏ సమస్య వచ్చినా పరిష్కరించగలిగితే పరిష్కరిస్తాం. లేకపోతే  దేవుడికి ముడుపు కడతా, లేకపోతే మొక్కుకుంటాం.  అంటే నో స్టీలింగ్. అలాగే ఎవరైనా హింసించినా, "వాడ్ని ఆ దేవుడే శిక్షస్తాడని సమాధానపడతాం గాని ప్రతిదాడి చెయ్యం" అన్నాడు జయ్.

"అది రెడిక్యులస్. ఎవడో హింసిస్తే చేతులు  ముడుచుకుని కూర్చోడమా?" సీరియస్‌గా అన్నాడు డాంటే.

"మిస్టర్ డాంటే, రవి అస్తమించని ఆంగ్లేయ ప్రభుత్వాన్ని దింపడానికి 80% ఫలమందించింది గాంధీగారి అహింసాయుతమైన పోరాటం కాదు? ఇప్పటికీ ఎంత పెద్ద దేశమైనా.., అది ఎంత చిన్నదైనా దురాక్రమణకి పాల్పడదు. ఎంత పెద్ద దేశమైనా హింసకి పాల్పడితే దానికి సహకరించదు" స్థిరంగా అన్నాడు గోర్కీ.

అమ్మాయి కాఫీలు తెచ్చింది. "అమ్మా.. మమ్మల్ని క్షమించాలి. ఏ కబురూ సూచనా ఇవ్వకుండా మీ ఇంట్లోకి చొరబడినందుకు. అఫ్‌కోర్స్ ప్రవస్థి చెప్పాడనుకో, అంతమాత్రాన మేం ఇలా చుట్టచుట్టుకుని చుట్టాల్లాగా రాకూడదుగదా!" అన్నాడు జయ్ కాఫీ అందుకుని రాబీకి ఇస్తూ.

"నాపేరు పరిమళ అండీ. మేమూ తెలుగువారమే. అతిథులు భగవంతుడితో సమానమని నమ్మే  వాళ్ళలో నేనూ ఉన్నాను. మీరాక మాకు నిజంగా ఆనందకరమైనదే" చిన్నగా నవ్వి అన్నది పరిమళ.

"మూడో అంతస్థులో ఇలాంటిదే పెద్ద హాలు ఉంది. మీరు అక్కడ నిస్సంశయంగా మాట్లడుకోవచ్చు." అనికూడా అన్నది పరిమళ. మొత్తం సంభాషణని రాబీకి ఇంగ్లీషులో చెప్పాడు ప్రవస్థి.

"మా దేశంలో ఎవర్నీ ఎవరూ ఇలా లోపలికి రానివ్వరు. రష్యాలో కూడా అంతేగదా రాజోవ్‌స్కీ. ఎవరొచ్చినా బయమే" ఇప్పటికి నోరు విప్పాడు స్టిట్సన్.

"అతిధి దేవోభవ అనే సిస్టం మొన్నటివరకూ మేమూ పాటించాం. అపరిచితుల్ని ఆనందంగా ఆహ్వానించి భోజనాలు పెట్టాం. ఎప్పుడైతే తీవ్రవాదుల అలజడి మొదలయిందో అప్పుడే మాకూ సందేహాలూ భయాలూ మొదలయ్యాయి. అంతేకాదు.. 'పిస్టల్, వెపన్, రాబరీ ఎండ్ మర్డర్' సిస్టమ్స్ ఇక్కడికీ దిగుమతి అయ్యాయి. సాంకేతిక విప్లవ మహిమ కొంతయితే, భాషా సంస్కృతిని ఇంగ్లీషు వారు తుడిచిపెట్టే తీవ్రప్రయత్నాలు మరికొంత. ఇప్పుడు భారతదేశంలోని చాలా ముఖ్యమైన మెజారిటీ భాషలు ఇంగ్లీషు భాష  వైపు తేరిపార చూస్తున్నాయి. ఉద్యోగం రావాలంటే ఇంగ్లీషు నేర్పడం తప్పదనే భ్రమ పల్లెపల్లికీ పాకింది." అన్నాడు గోర్కీ.

"ఆ మాటా నిజమేగా?" అన్నాడు శమంతో.

"ఖచ్చితంగా నిజంకాదు. యూరప్‌లో అమెరికాలో అనేకానేక దేశాల్లో మాట్లాడేది ఇంగ్లీషేగా. కానీ అక్కడ నిరుద్యోగ సమస్యలేదా? ఇంగ్లీషు మాత్రమే ఉద్యోగాన్నిస్తుంది అనుకోవడం భ్రమ. జర్మన్, చైనీస్, రష్యన్ సైంటిస్టులు లేరా? వారూ ఇంగ్లీషులోనే పరిశోధనలు చేశారా? అందాకా ఎందుకూ, మనమంతా వేరు వేరు రాష్ట్రాలకి చెందిన వాళ్ళం. వేర్వేరు దేశాలని చెందినవాళ్ళం. ఎవరి భాష వారిదే. ఎవరి సంస్కృతి వారిదే, ఎవరి జీవన విధానం వారిదే. కానీ ఇప్పుడు మనసందరినీ కలుపుతున్న లింక్ భాష ఆంగ్లభాష. అది ఎవరైనా ఒప్పుకుని తీరాల్సిన విషయం. ఒక లింక్ భాషకోసం మాతృ భాషల్ని మనమే చంపేసుకోకూడదుగా. మన సంస్కృతినీ, సంప్రదాయాల్నీ మనమే చంపేసుకోకూడదుగా!" స్పష్టంగా ఆవేశంగా అన్నాడు గోర్కీ. మిగతా కాఫీ సేవన సమయమంతా చిత్రమైన మౌనసన్నిధిలో గడిచింది. పరిమళ అన్నీ వింటోంది.

*(కొనసాగింపు వచ్చే నెలలో)*

Post your comments